క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కన్నాయిగూడెం: మండలంలో 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ ఏఈ స్వామి శుక్రవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

సన్మానం



మంగపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టిన ఎంపీఓ శ్రీనివాస్‌ను అంబేడ్కర్ యువజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి దీగొండ కాంతారావు, మండల అధ్యక్షుడు గుగ్గిళ్ల సురేశ్, నాయకులు దంతెనపెల్లి నరేందర్, శ్రీనివాసాచారి, పూసల నర్సింహారావు, మూగల రాము, ఎల్పీ సారయ్య, యాసం హరీశ్, కూకట్ల శ్రీనివాస్, ఈసంపెల్లి సురేందర్, యాసం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బోనస్ డబ్బులు చెల్లించాలి

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యాసంగి సన్నధాన్యం బోనస్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో 33 వేల 786 క్వింటాల సన్నధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి నాలుగు నెలలు గడుస్తున్న ఇప్పటికి బోనస్ చెల్లించలేదని అన్నారు. ప్రభుత్వం బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

డైరీ ఆవిష్కరణ



వాజేడు: తెలంగాణ పీఆర్‌టీయూ జిల్లా డైరీని శుక్రవారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంఈఓ కాకర్లపూడి విక్రాంత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పోరిక రామన్ననాయక్, మండల అధ్యక్షుడు కురుటూరి సతీశ్, ప్రధాన కార్యదర్శి బాల సంధ్య, స్వరూప్ సింగ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

గ్రామ కమిటీల ఏర్పాటు



మంగపేట: మండలంలోని కోమటిపల్లి, మల్లూరులో తెలంగాణ అంబేడ్కర్ సంఘం నూతన గ్రామ కమిటీలను ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎంపెల్లి వీరస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. కోమటిపల్లి గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా గారె వసినువర్ధన్, అశోద సతీష్, మల్లూరు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా జంపయ్య, గడ్డం శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా నియమించారు. ఈ మేరకు వారికి వీరస్వామి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, పునరావు, గాజర్ల రాజు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



మల్లూర్: మండలంలోని నాచారంలో జిల్లా ఏపెడమిక్ టీం సభ్యులు శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో దోమల మందు నివారణ మందును పిచికారీ చేయించారు. వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏపెడమిక్ టీం రమేశ్‌కుమార్, తలకోటి పరమేశ్వర్, సతీష్, కాపర్తి రాజు, ఊరుకొండ గోపి, హెల్త్ అసిస్టెంట్ హేమ్ సింగ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల కృష్ణగౌడ్ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ పరామర్శించి కృష్ణగౌడ్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, మండల నాయకుల బైరం భద్రయ్య, చిలుముల రమణాచారి, పెరుమాండ్ల రవీందర్, తౌటం నవీన్, నాగరాజు, రాజేశ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

మహిళల ఆరోగ్యానికి రక్ష

- స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం
- ఈనెల 26 వరకు ప్రత్యేక వైద్యశిబిరాలు



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వెంకటాపురం(కె): నిత్యం ఇంట బయట పని ఒత్తిడితో ఉండే మహిళల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించి వారి ఆరోగ్యానికి రక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో ప్రతీ మహిళకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. మండలంలో ఈనెల 26వ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మహిళ శిశు సంక్షేమ శాఖ పోషన్ అభియాన్ కార్యక్రమానికి అనుబంధంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలను గుర్తించనున్నారు. వారికి అవసరమైన మందులు అందించడంతో పాటు మెరుగైన చికిత్స అవసరమైన వారిని వైద్యశాలకు తరలించనున్నారు. మండలంలోని పల్లె దవాఖానలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని ఎదిర ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం ఏటూరునాగారం డిప్యూటీ డీఎంహెచ్ఓ కోరం క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం ఎదిర, ఆలుబాక పంచాయతీ సిబ్బందికి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులును అందజేశారు. అలాగే ఈనెల 22న ఛాతి వైద్య నిపుణులతో, 23న స్త్రీ వైద్య నిపుణులతో, 26న దంత వైద్య నిపుణులతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మండలంలో మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ వైద్య శిబిరాల్లో బీపీ, షుగర్, కేన్సర్ స్క్రీనింగ్, తల సేమీయా సికిల్ సెల్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు ఇస్తాం.

– డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్

‘స్వస్థ్ నారీ సశక్త్’తో సంపూర్ణ ఆరోగ్యం



ఎస్ఎస్‌తాడ్వాయి: పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్



కన్నాయిగూడెం: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

- డాక్టర్ అభినవ్

కన్నాయిగూడెం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు పరీక్షలు నిర్వహించడంతో వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ అభినవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతు వేదికలో డాక్టర్ అభినవ్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభయాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల మహిళలకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఎంపీడీఓ నీతిఆయోగ్ రవీశ్, సుజాత, రమణకుమారి, సుమలత, శారధ తదితరులు పాల్గొన్నారు

ఎస్ఎస్‌తాడ్వాయి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి అనూహ్యస్పందన లభించింది. ఈశిబిరంలో మండల వైద్యాధికారులు రణధీర్, చిరంజీవిల ఆధ్వర్యంలో పిల్లల వైద్య నిపుణులు నవీన్ 12 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి రణధీర్ మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరంలో 313 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డీపీఎంఓ సంజీవరావు ఉన్నారు.

జీపీ సిబ్బందికి వైద్య పరీక్షలు



సిబ్బందిని పరీక్షిస్తున్న వైద్యుడు

వాజేడు: స్వచ్ఛతా ఈ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలను ఎంపీవో శ్రీకాంత్ నాయుడు సమక్షంలో వాజేడు వైద్యాధికారి మధుకర్ నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బంది బీపీ పరీక్షించి రక్త నమూనాలను తీసుకున్నారు.

డీఎస్ఆర్ ట్రస్టు సేవలు అభినందనీయం

- ఎంఈఓ పాదెం మేనక



మంగపేట: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రతాపరెడ్డి

మంగపేట: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేస్తు చేయూతనందిస్తున్న డీఎస్ఆర్ ట్రస్టు సేవలు అభినందనీయమని ఎంఈఓ పాదెం మేనక అన్నారు. మండలంలోని మంగపేట, కమలాపురం, మల్లూరు, నర్సింహాసాగర్, రాజుపేటలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో 06 నుంచి 09వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు గణితం, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ గూర్చిన సమాచారంతో కూడిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు దొడ్డ ప్రతాపరెడ్డి, మండల పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు భిక్షం, శ్రీలక్ష్మి, సూర్యనారాయణ, వెంకన్న ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, క్రాంతి, వెంకటేశ్వర్లు, రమేశ్, నాగేందర్, సతీష్, మాధురీదేవి, అనంతరావు, అనసూయ, సునీత, రాజు పాల్గొన్నారు.

గణితం, ఏఐ పుస్తకాలు పంపిణీ

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్‌లోని విద్యార్థులకు డీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏఐ, గణితం పుస్తకాలను ఎంఈఓ కొయ్యడ పంపిణీ చేశారు. అనంతరం డీఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు దొడ్డ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రాథమిక గణితంలోని క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థం చేసుకోవడానికి, వారిలో కనీస సామర్థ్యాలను పెంపొందించడానికి వీలుగా ప్రత్యేకంగా రూపొందించిన వర్క్‌బుక్స్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఇటీవల హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీ తెలంగాణలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి ముక్కెర యశ్వంత్‌కు ప్రతాపరెడ్డి రూ.1116ల నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ గద్దె కోసం పుట్ట మట్టి



పుట్ట మట్టి తెస్తున్న మహిళలు

వాజేడు: ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ పండుగకు మహిళలు గద్దెలను సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా బతుకమ్మ గద్దెను తయారు చేయడం కోసం పుట్ట మట్టిని తీసుకువచ్చారు. మండల కేంద్రంలోని స్థానిక మహిళలు కాచారం నుంచి మట్టి తెచ్చి గద్దెను సిద్ధం చేస్తున్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

ములుగు రూరల్: మండల పరిధిలోని జాకారం, అబ్బాపూర్, శ్రీరాములపల్లి, భూపాల్‌నగర్, కోయగూడెం మద్దునూరుతండా మాన్‌సింగ్‌తండా, పలు గ్రామాల్లోని పాఠశాలల్లో ఎస్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సతీశ్‌కుమార్, మధు సుధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలను విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ హమీద్, దేగల రమేష్, అగయ్య, సౌజన్య, భిక్షపతి, మహేష్ సునీతతో పాటు తదితరులు ఉన్నారు.

గొత్తికోయగూడెం సందర్శన



గొత్తికోయలతో అధ్యాపకులు, విద్యార్థులు

ములుగు రూరల్: ములుగు మండలంలోని జగ్గన్నగూడెం పంచాయతీ పరిధి బోడరామయ్యగడ్డలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గొత్తికోయగూడాన్ని సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి వారు సందర్శించారు. గూడెంలో 22 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించినట్లు ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఆర్థిక, సామాజిక వెనకబాటుతనాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధ్యాపకులు బాలయ్య, న్యాక్ కోఆర్డినేటర్ కవిత, భాస్కర్, సరిత, శిరీషా, అనిల్, శంకర్, ఉదయశ్రీ పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు

వెంకటాపురం(ఎం): యూరియా బస్తాల కోసం మండలంలోని ఇంచెన్‌చెరువపల్లి రైతులు పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం నర్సాపూర్ పీఏసీఎస్‌కు సుమారు 20 కిలోమీటర్ల దూరం ఉదయం 3 గంటలకు చేరుకొని క్యూలో వేచి ఉన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామంలో మొత్తం 1500 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నామని తెలిపారు. నర్సాపూర్ సొసైటీకి వచ్చే యూరియా బస్తాలను గ్రామానికి 100 బస్తాలు మాత్రమే కేటాయించడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కలెక్టర్, వ్యవసాయ అధికారులు స్పందించి ఇంచెన్‌చెరువపల్లి గ్రామస్తులకు గ్రామంలో యూరియా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఓటరు జాబితా సవరణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

వాజేడు: ఓటరు జాబితా సవరణపై తహసీల్దార్ శ్రీనివాస్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 నుంచి 2025 వరకు ఓటరు లిస్టు సవరణను నాలుగు కేటగిరీలుగా విభజించి సవరణ చేయాలని తెలిపారు. ఎవరెవరి ఏ కేటగిరిలోకి వస్తారో వివరించారు. తప్పులు లేకుండా ఏ, బీ, సీ, డీ కేటగిరీల వారీగా ఓటరు నమోదు చేయాలన్నారు.

ప్రవక్త బోధనలతో ఐక్యత

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: శాంతి, మతసామరస్యానికి నిలయంగా ప్రవక్త బోధనలు మనల్ని ఐక్యతవైపు నడిపిస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణం రాజీవ్‌నగర్‌లోని జామా మసీదు నుంచి స్థానిక అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ముస్లింల ర్యాలీలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ బోధనలు శాంతి, సహనం, మానవతా విలువలకు ప్రతీక అని అన్నారు. ఆయన సందేశాలు మతసామరస్యానికి మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిప్పాల రాజేందర్, అంబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కిట్లు తప్పనిసరి

గీతా కార్మికులకు తాటి చెట్టు ఎక్కే సమయంలో ప్రమాదాలు జరుగకుండా ఉండటానికి కాటమయ్య రక్షణ కిట్లను తప్పనిసరిగా వినియోగించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలం ఎస్ఎం కొత్తపల్లి(ఎస్ఎం) గ్రామ శివారు సోలిపేట తాటి వనంలో జిల్లా బీసీ సంక్షేమ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. కల్లుగీత కార్మికులకు పూర్తి స్థాయిలో కాటమయ్య రక్షణ కిట్లను అందించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గీతా కార్మిక సంఘం నాయకులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



వేశాలపల్లిలో అవగాహన కల్పిస్తున్న తిరుపతి

భూపాలపల్లి రూరల్: బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సహాయ ఎన్జీఓ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ శాస్త్రాల తిరుపతి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని బాంబుల గడ్డ, వేషాలపల్లి గ్రామంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బలమైన భారత నిర్మాణమే లక్ష్యంగా అడుగులేయాలంటే ప్రతీ గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన రావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళా సంఘాల కార్యదర్శి ఈర్ల స్వప్న, కిన్నెర పల్లవి, సామల శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు



గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌తో పాటు గిరిజన గురుకుల బాలికల పాఠశాల, విద్యానికేతన్ హై స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో ఆకట్టుకునే బతుకమ్మలు తయారు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఉపాధ్యాయులు బతుకమ్మ పండగ విశిష్టత, ప్రాముఖ్యతను గూర్చి విద్యార్థులకు వివరించారు. ఆయా పాఠశాలలో ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఆదర్శ హై స్కూల్‌లో ఆదికావ్యమైన రామాయణ ఇతిహాసంలోని విశేష దృశ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, టీటీడబ్ల్యూఆర్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, కేజీబీవీ ఎస్ఓ చల్ల సునీత, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, విద్యానికేతన్ కరస్పాండెంట్ బుర్ర వెంకటేశ్‌గౌడ్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు కృషిత, సుజారాణి, టీటీడబ్ల్యూఆర్ వైస్ ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ పరిశీలన

కాటారం: యూరియా సక్రమంగా పంపిణీ చేయడానికి వ్యవసాయశాఖ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఓ పూర్ణిమ తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్, దేవరాంపల్లి డీసీఎం వద్ద శుక్రవారం కొనసాగిన యూరియా పంపిణీని ఏఓ పరిశీలించారు. యూరియా పంపిణీ వద్ద ఏఈఓలు ఉండి రైతులకు ఒక్కో యూరియా బస్తాకు ముందుగా కూపన్లు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా యూరియా పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. దేవరాంపల్లిలో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియాకు ప్రత్యామ్నాంగా రైతులు నానో యూరియా వినియోగించుకోవాలని సూచించారు. నానో యూరియాతో పంట దిగుబడి పెరగడంతో పాటు పర్యావరణంలో కాలుష్య నివారణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఫెర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజన్న, అస్మా, యోగిత, దీపక్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అధికారుల వత్తాసు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

టేకుమట్ల: ఇసుక అక్రమ రవాణాకు అధికారులు వత్తాసు పలుకుతూ స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుకను అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముందుకు వెళ్తున్నారని, దాన్ని అబాసు పాలు చేస్తే మండల ప్రజలు ఊరుకోరని అన్నారు. దళారులు ఇసుకను నిత్యం మండల కేంద్రంలోని చలివాగు నుంచి వందల సంఖ్యలో తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యేకు గానీ, కాంగ్రెస్ పార్టీకి గానీ చెడ్డపేరు తీసుకుచ్చేలా ప్రయత్నిస్తే మండల కాంగ్రెస్ పార్టీ ఊరుకోదని హెచ్చరించారు. జిల్లా, మండల నాయకులు దొంతుల శ్రీనివాస్, వైనాల రవీందర్, బండ శ్రీకాంత్‌పాణి, నాంపెల్లి వీరేశం, పొన్నం సాంబయ్య, క్రాంతి పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: వరంగల్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని మండల యువజన సంఘం నాయకుడు దుర్గం రాజేశ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో నాయకులతో కలిసి ఆవిర్భావ కరపత్రాలను ఆవిష్కరించారు. సభను మేధావులు, నాయకులు, ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.